క్లుప్తంగా

గ్రామాలను అభివృద్ధి చేస్తాం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చౌటపల్లె గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.30 లక్షల అంచనాతో గ్రావెల్ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీఓ ఎస్.సూర్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ మార్తల ఈశ్వరమ్మ, లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల నిధులపై ఆడిట్ చేయాలి

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధుల జమా ఖర్చులపై ఆడిట్ చేయాలని ప్రజా పక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మీరెడ్డి తెలిపారు. సోమవారం ఆ మేరకు ఆయన తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పుత్తా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులను ప్రజాప్రతినిధులు, అధికారులు లాలూచి పడి అభివృద్ధి పనులు చేయకున్నా నిధులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బద్వేలు అర్బన్ : ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం నియోజకవర్గంలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమాధికారి రామయ్య తెలిపారు. సోమవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్ అర్హత కలిగి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికి ఈ నెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెరిట్ జాబితా ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బద్వేలు అర్బన్ : రాబోవు నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బద్వేలు మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా వర్షాల వలన ఇబ్బందులు తలెత్తినా, చెట్లు విరిగిపడినా కంట్రోల్ రూమ్ నెంబర్ 63019 56870 నెంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే ఆయా సచివాలయాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

5 సీసీ రోడ్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పోరుమామిళ్ల : మండల కేంద్రానికి 5 సీసీ రోడ్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 20 వరకు అన్ని గ్రామపంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పంచాయతీ సర్పంచ్ సుధాకర్ పట్టణంలో మంజూరైన 5 సిమెంట్ రోడ్లకు టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో దాతలు

కాశినాయన : మండలంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలోని వృద్ధులకు నరసాపురం గ్రామానికి అజ్మీర్ తన తండ్రి కర్నాని పెద్దజమాల్‌వలి వర్ధంతి సందర్భంగా సోమవారం అన్నదానం చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంచి పెట్టారు. అలాగే నరసాపురం స్కూల్‌లోని పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, అజ్మీర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సగిలేరు వెలవెల.. రైతన్న విలవిల



నీరులేక వెల వెల బోతున్న సగిలేరు

అట్లూరు : జీవనదిలా ప్రవహించే సగిలేరు నీరులేక వెలవెలబోతోంది. వేలాది ఎకరాల్లో పంట వేసుకోలేక రైతు విలవిలలాడిపోతున్నాడు. నల్లమల అటవీ ప్రాంతంలో పుట్టిన సగిలేరు కలసపాడు, కాశినాయన, బికోడూరు, పోరుమామిళ్ల, బద్వేల్ మండలాల మీదుగా ప్రవహిస్తూ అట్లూరు మండలం మల్లినేనిపట్నం వద్ద పెన్నానదిలో విలీనమవుతుంది. అట్లూరు మండలం నడిబొడ్డున ఏరు ప్రవహిస్తోంది. నదికి ఒక వైపు ఆరు, మరోవైపు ఆరు పంచాయితీ గ్రామాలున్నాయి. ఏరులో నీరు పుష్కలంగా ఉంటే.. ఇరువైపులా వేలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. అయితే ఇటీవల నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి ఖరీఫ్ సీజన్ దాటిపోయింది. రబీ ప్రారంభమవుతున్నా. వర్షం జాడలేదు. దీంతో సగిలేరు ఒట్టిపోయింది. గత ఏడాది వరకూ జీవనదిలా ప్రవహించినా.. ఈ ఏడాది అక్టోబరు నెలలో చుక్క నీరు చేర లేదు. పంట ఎలా సాగు చేయాలో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి బ్రహ్మసాగర్ నుంచి అయినా సగిలేరుకు నీరు వదలాలని కోరుతున్నారు.

బ్రహ్మసాగర్ నీరు వదలాలి



వర్షాలు లేక సగిలేరు నది ఎడారిలా మారింది. మా పొలాలు బీడుబారాయి. అధికారులు స్పందించి బ్రహ్మసాగర్ నుంచి సగిలేరు నదికి నీరు వదలాలి. లేకపోతే మా పొలాలు పంటలకు నోచుకోక పశుగ్రాసానికి, తిండి గింజలకు ఇబ్బంది పడాల్సిందే.

మద్దిక చిన్నమునిరెడ్డి, రైతు, పెద్దకామసముద్రం, అట్లూరు మండలం

కరవు మండలంగా ప్రకటించాలి



ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ మొదలవుతున్నా వర్షం జాడే కనిపించలేదు. కనీసం సగిలేరు నదిలో నీరున్నా పైర్లు సాగు చేసుకునేవాళ్లం. వర్షం రాక..నీరు లేక పొలాలు బీడుబారాయి. కరవు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

సగిలి ఈశ్వరరెడ్డి, రైతు, కోనరాజుపల్లి, అట్లూరు మండలం

లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతి కళ

ప్రొద్దుటూరు క్రైం : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతి కళ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్‌లో డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ఆడబిడ్డను రక్షించాలంటే లింగ నిర్ధారణ జరగకుండా చేయాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా చూడాలని, ఎవరైనా స్కానింగ్ సెంటర్ వారు లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే కమిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. చాలా మంది కుటుంబంలోని పెద్దల ఒత్తిడి కారణంగా ఆడ శిశువు అని తెలియగానే గర్భస్రావానికి సిద్ధమవుతున్నారన్నారు. తల్లిదండ్రులు ఆడ బిడ్డ అయినా మగ బిడ్డ అయినా సమానంగా చూసుకుని మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు శ్రీదేవి, దేవదాసు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణలో కీలకపాత్ర పోషించండి



కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పట్టణ సుందరీకరణలో కీలకపాత్ర పోషించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు మరింత చిత్తశుద్ధితో పనిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ఈ నెలాఖరులోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణ సుందరీకరణలో తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



ఖాదరపల్లెలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం

చాపాడు : మండలంలోని నాగులపల్లె, ఖాదరపల్లె, పల్లవోలు గ్రామాలలో సోమవారం సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎంపీడీఓ రామానుజం మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.1.79 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. నాగులపల్లెలో రూ.10లక్షలు, ఖాదర్‌పల్లె రూ.13.50లక్షలు, పల్లవోలులో రూ.1.20లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు భూమిపూజ చేశారు. మండలంలోని 20 పంచాయతీలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాయబ్ రసూల్, జైనుల్లా, రజినీకాంత్, రామాంజనేయులు, రామోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి



బి.కోడూరు: తంగేడుపల్లెలో ఉపాధి హామీ పనులకు భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



గోపవరం: బెడుసుపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బి.కోడూరు : మండలంలోని అన్ని గ్రామాలను ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ తెలిపారు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తంగేడుపల్లె, ప్రభలవీడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరై తంగేడుపల్లె పంచాయతీకి రూ.20 లక్షలతో మెటల్ రోడ్డు, ప్రభలవీడు పంచాయతీకి రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, మినీ గోకులాల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోడి లక్ష్మిదేవి, ఎంపీడీఓ భాస్కర్ రావు, పంచాయతీరాజ్ ఏఈ నారాయణరెడ్డి, ఏపీఓ రాజా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ ఖాజా, నాయకులు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, కె.రామసుబ్బారెడ్డి, శేషారెడ్డి, రాజమోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గోపవరం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెడుసుపల్లెలో రూ.7.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి గతంలో గ్రామ సభలు నిర్వహించారు. ఆమోదం పొందిన పనులకు పల్లె పండుగ ద్వారా భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. 22 పనులకు గాను రూ.1.26 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామిరెడ్డి, ఏపీఓ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, నిఖిత, మోశ, శ్రీనివాసులరెడ్డిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన ఆధ్యాత్మిక ప్రవచనం



శంకర్‌ను సన్మానించిన సాహితీ అభిమానులు

పోరుమామిళ్ల : మండలంలోని కమ్మవారిపల్లె కాలనీలో సోమవారం టీటీడీ ధర్మాచార్యులు, రాజంపేట మెజిస్ట్రేట్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ పసుపులేటి శంకర్ చేసిన ప్రవచనం భక్తులను అలరించింది. కమ్మవారిపల్లెలో నిర్మించిన నూతన ఆలయంలో ఈనెల 16న విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఈ నేపథ్యంలో మూడు రోజులపాటు పూజాదికాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పసుపులేటి వెంకటమ్మ కల్యాణ మండపానికి ఒంటిమిట్ట పోతన సాహితీ పీఠం అధ్యక్షులు, టీటీడీ ధర్మాచార్యులు, మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ప్రారంభం చేశారు. ఆధ్యాత్మిక ప్రవచనానికి పలువురు సాహితీ అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌ను శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బద్వేలు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తీవ్ర అల్పపీడనం కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందని, అలానే 4 రోజులపాటు వర్షాలు ఉంటాయన్నారు. అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని ప్రజలను ఆయన కోరారు. చెట్ల కింద, కరెంటు స్తంభాల కింద ఉండరాదని, తేమ ఉన్న కడ్డీలను పట్టుకోవద్దని ఆయన సూచించారు.

బండ లాగుడు పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలో సోమవారం ఒంటెద్దు బండలాగుడు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ వైస్‌చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వార్యల గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బెల్టుషాపులు నిర్వహిస్తే సహించం'

బ్రహ్మంగారిమఠం : కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానంలో బ్రహ్మంగారిమఠం మండలంలో రెండు మద్యషాపుల నిర్వహణ జరిగింది. షాపులు వచ్చిన వారు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సహించమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జి శివకుమార్ తెలిపాడు. సోమవారం బి.మఠం లో విలేకరుల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ మద్య నిషేధం చేయాల్సిన ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చిందన్నారు. బి.మఠం మండలంలో గతంలో ఒక్క షాపు ఉండగా ఈ ప్రభుత్వం రెండు షాపులు ఇచ్చిందన్నారు. అధికారులు కేవలం షాపులు ఉన్నచోట మాత్రమే మద్యం అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోవింద్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించండి



ఆందోళన నిర్వహిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

బద్వేలు అర్బన్ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బద్వేలు శాటిలైట్ ఆఫీసు ముందు లైఫ్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (1964) ఆధ్వర్యంలో ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జోనల్ జాయింట్ సెక్రటరీ చవ్వా వెంకటరామరెడ్డి మాట్లాడుతూ పాలసీదారులకు బోనస్ పెంచడంతోపాటు పెంచిన పాలసీ ప్రీమియంను తగ్గించాలని కోరారు. అలాగే ఏజెంట్లకు కమీషన్ పెంచాలని కోరారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏజెంట్స్ యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బరాయుడు, శివరామిరెడ్డి, సుబ్బారావు, బాలకేశవ, లక్ష్మి, శాటిలైట్ ఆఫీసు పరిధిలోని ఏజెంట్లు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న షాకీర్ హుస్సేన్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమంలో మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బావమరిది గండ్లూరు వీరశివారెడ్డి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు 60 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువులను వితరణగా అందచేశారు. కార్యక్రమంలో మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, దివ్యాంగులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా ఉండాలి



పంటనమోదుపై మాట్లాడుతున్న ఏడిఏ నాగరాజ

అట్లూరు : ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు పక్కాగా చేయాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలోని సోమవారం తిప్పనపల్లి, వీరబల్లి రైతు సేవా కేంద్రాలలో పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పొరపాటున పొలాలలో ఒక పంట వేసి ఉంటే పంట నమోదులో వేరే పంట సాగు చేసినట్టు నమోదైతే రైతు వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయాలన్నారు. అలానే పీఎం కిసాన్ ఎవరైనా అందలేని వారు సంబంధిత ధృవపత్రాలతో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతుసైవా కేంద్రం సహాయకులు మన్యం సిద్దారెడ్డి, బిందూరాణి, వెంకటేశ్వర్లు, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం మండల పరిధిలోని తంబళ్లగొంది, యర్రబల్లి గ్రామాలతోపాటు బద్వేలు మండల పరిదిలోని చెన్నంపల్లి, పంగావాండ్లపల్లి, గోపవరం మండల పరిధిలోని వల్లెరవారిపల్లి, సోత్రీయ రామాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎగ్జిబిషన్ దోపిడీపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో నిర్వాహకుల దోపిడీని అరికట్టాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం ఇచ్చినట్లు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎంట్రీ ఫీజు దసరా పండుగ రోజున, తర్వాత రోజున రూ.100 వసూలు చేశారన్నారు. ప్రజల నుంచి అధికంగా డబ్బు వసూలు చేసిన ఎగ్జిబిషన్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : సాంఘీక, గిరిజన సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో 5,050 మంది ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ బి.గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలని, ఈ నెల 21వ తేదీ లోపల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్సీఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైదుకూరు : ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు మైదుకూరు సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.డేవిడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సాంఘిక సంక్షేమ శాఖ 5,050 మందికి డీఎస్సీలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేవారు వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు ఉండాలని తెలిపారు. అలాంటి వారు ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారిలో మెరిట్ లిస్ట్ ప్రకారం ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇస్తామని వివరించారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఐడీపీఎస్ విద్యార్థిని



హర్షిత

చాపాడు : ప్రొద్దుటూరులోని జార్జి కొరోనేషన్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అండర్–14 బ్యాడ్మింటన్ పోటీలలో స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని బి.హర్షిత జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఐడీపీఎస్ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి తెలిపారు. తమ పాఠశాలలలో చదువతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ క్రమంలో ఏడవ తరగతి విద్యార్థి హర్షిత బ్యాడ్మింట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటిందన్నారు. మంగళవారం జరుగనున్న జిల్లా స్థాయి పోటీలలో తమ స్కూల్ విద్యార్థిని పాల్గొనటం పట్ల చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ డి.రవీంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు.

జమ్మలమడుగును అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు: కౌన్సిల్ సభ్యుల సహకారంతో జమ్మలమడుగును అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటి అభివృద్ధితో పాటు ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల కన్నెలూరులో కలుషితమైన నీరు తాగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు.

సమావేశానికి సకాలంలో రాకపోతే ఎలా...

ఎమ్మెల్యే వచ్చే వరకు సమావేశాన్ని నిర్వహించమని చెప్పడం ఏమిటని ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లా జానీ ప్రశ్నించారు. అధికారులు సమయం ఇవ్వకుండా ఒక రోజు ముందు 36 పేజీల పుస్తకాన్ని ఇచ్చి సమావేశానికి రావాలని చెప్పడం సరికాదన్నారు. అజెండా, విధివిధానాల గురించి ముందుగానే సమాచారం ఉంటే బాగుండేదని చెప్పారు. అభివృద్ధి పనుల బిల్లులను అధికారులు వరుస క్రమంగా చెల్లించాలని ముల్లాజానీ కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



మృతురాలి కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తదితరులు

పులివెందుల టౌన్ : నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో నివాసముంటున్న నర్రాల ఆదిలక్షుమ్మ (83) మరణించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్ర సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో రాజు సిబ్బందితో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించినా నేత్రదానంపై అవగాహన కల్పించి 9966509364 లేదా 7093204537 నంబర్‌లకు సమాచారం ఇచ్చి అంధరహిత సమాజానికి కృషి చేయాలని కోరారు.